మా కులం మంత్రులే తప్పు చేశారా..?
- కావాలనే టార్గెట్
- వాల్మీకి సమాజ స్వామీజీల ఆగ్రహం

7

రాష్ట్రంలో 256 మంది నకిలీ వైద్యులు
- పలువురిపై కేసులు
- : వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్

అట్టుడికిన మద్దూరు

- వినాయక నిమజ్జన ఊరేగింపుపై రాళ్లదాడి
- హిందూ సంఘాల నిరసన ర్యాలీలో ఉద్రిక్తత, లాఠీచార్జ్
- 21మంది అరెస్టు
- పోలీసులు, ప్రజలకు గాయాలు



పోలీస్ స్టేషన్ వద్ద హిందూ సంఘాల కార్యకర్తలు, ప్రజలు

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా మద్దూరు రెండు రోజుల నుంచి అట్టుడుకుతోంది. ఆదివారం రాత్రి 8.30 గంటల తర్వాత రాం రహీంనగర్‌లో వినాయక నిమజ్జనం ఊరేగింపు ఓ ప్రార్థనామందిరం ముందు నుంచి సాగుతోంది. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా చేసి ఊరేగింపుపై రాళ్లు విసిరారు. అప్రమత్తమైన ఊరేగింపు నిర్వాహకులు, అభిమానులు ఎదురునిలిచారు. దీంతో గొడవ తీవ్రమైంది. అరగంటకుపైగా గొడవ సాగింది. అంతలోనే పోలీసులు పెద్దసంఖ్యలో తరలివచ్చి లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను అక్కడనుంచి పంపేశారు. వినాయక ఊరేగింపు యథావిధిగా జరిగింది. అయితే సోమవారం ఉదయం నుంచే మద్దూరు పట్టణమంతా నివురుగప్పిన నిప్పులా మారింది. 9 గంటల తర్వాత పట్టణంలోని ప్రధానరోడ్లపై నిరసన ర్యాలీ చేసేందుకు వినాయక కమిటీ నిర్వాహకులు, హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు నాయకులు తరలివచ్చారు. మధ్యాహ్నం అయ్యేసరికి వేలాదిమంది చేరారు. ప్రభుత్వానికి, సీఎంతోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువులపై ఇటు పోలీసులు, అటు మరో వర్గం వారు దాడి చేస్తున్నారని నినాదాలు చేశారు. గంటగంటకు నిరసన ర్యాలీకి జనం పెరిగిపోతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శాంతిగా ఉండాలని సూచించారు. రాత్రి రాళ్లు రువ్విన సంఘటనకు సంబంధించి 21మందిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాకపోవడం మరింత ఉద్రిక్తతకు కారణమైంది. ఒక్కసారిగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఓ మహిళ పోలీసులనుంచి తప్పించుకునేందుకు పరుగులుతీస్తుండగా కానిస్టేబుల్ లాఠీతో కొట్టారు. ఒక్కసారిగా కుప్పకూలిన మహిళ కేకలు పెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యిం ది. మద్దూరులో పరిస్థితి అదుపు తప్పుతుండడంతో సమీప ప్రాంతాలనుంచి పోలీసులను రంగంలోకి దించారు. సీఆర్‌పీఎఫ్ బలంగాలను మొహరింపచేశారు. పోలీస్ స్టేషన్‌ను ముట్టడించడంతో పరిస్థితి మరింత అదుపు తప్పినట్టయ్యింది. దీంతో లాఠీచార్జ్ చేశారు



లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

సీఎం అత్యవసర సమావేశం

అంతలోనే సీఎం సిద్దరామయ్య అధికారిక నివాసం కావేరిలో అత్యవసర సమీక్ష చేశారు. హోం మంత్రి పరమేశ్వర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామితో పాటు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తప్పు చేసినవారు ఎవరైనా కఠినంగా శిక్షించాలని సీఎం ఆదేశించారు. వెంటనే మద్దూరుకు వెళ్లాలని అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మంత్రి చలువరాయస్వామిని సీఎం ఆదేశించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ మద్దూరు ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేశామన్నారు. బీజేపీ వారు రెచ్చగొట్టడం, అబద్ధాలు చెప్పడంలో వారికి మించినవారు లేరన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ ఇదో చిన్నసంఘటన అని అయితే ఉద్రిక్తతకు కారణమైందని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

మండిపడ్డ బీజేపీ నాయకులు

కాగా గొడవపై బీజేపీ, జేడీఎస్ నాయకులు విరుచుకుపడ్డారు. హిందువులపై దాడి రాష్ట్రంలో వ్యూహాత్మకంగా సాగుతోందని మండిపడ్డారు. బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అన్నింటా విఫలం చెందిందన్నారు. వరుసగా హిందువులను టార్గెట్ చేస్తున్నారన్నారు. ధర్మస్థల, మైసూరు ఉత్సవాలు హిందువులకు అవమానం జరిగేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. హిందువులపై దాడులు రాష్ట్రంలో నిరంతరంగా సాగుతున్నాయని, ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తుండడమే కారణమన్నారు. లాఠీచార్జ్‌కి కారణాలు తెలుసుకోకుండా రాజకీయం మాట్లాడుతున్నారంటూ ఆరోపించడం సరికాదన్నారు. అనవసరంగా లాఠీచార్జ్ కొనసాగితే పోరాటం చేస్తానని హెచ్చరించారు.

మరో కేంద్రమంత్రి, స్థానిక ఎంపీ కుమారస్వామి మద్దూరుసంఘటనపై తీవ్రంగా స్పందించారు. ఎస్పీ, డీసీలకు ఫోన్ చేసి పరిస్థితిని అదుపులోకి తెస్తారా..? లేదా నేరుగా రంగంలోకి రమ్మంటారా..? అంటూ హెచ్చరించారు. జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ మద్దూరుకు వెళ్లి నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని మండిపడ్డారు.

కరెంట్ కట్ చేశారు: అశోక్

ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ వినాయక విగ్రహం ఊరేగింపు వెళ్లినప్పుడు ఒక్కసారిగా కరెంటు ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. కరెంటును ఎవరు నియంత్రిస్తారని ప్రశ్నించారు. కేవలం 5-10 నిమిషాలలోనే కరెంటు తీసినప్పుడు రాళ్లు రువ్వారన్నారు. ఇటు రాళ్ల దెబ్బలతో పాటు పోలీసులనుంచి కూడా హిందువులకే లాఠీ దెబ్బలు తగిలాయన్నారు.

హిందువులపై కేసులు లేవు: మంత్రి

మద్దూరు ఘటనలో హిందువులపై కేసులు నమోదు చేయలేదని, రాళ్లు రువ్విన వివాదంలో 21మందిని అరెస్టు చేశామని ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి తెలిపారు. బీజేపీ, జేడీఎస్ నాయకలు కొందరు రాజకీయంగా ఎదుర్కొనలేక ఉద్రిక్తతకు ఆజ్యంపోసేలా వ్యవహరిస్తున్నారన్నారు.

మండ్య జైలుకు 21 మంది..

వినాయక నిమజ్జన ఊరేగింపులో రాళ్లు రువ్విన సంఘటనలో 21మందిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి తెలిపారు. 21మందిని అరెస్టు చేశామని వారిని కోర్టు ముందు హాజరు పరిచి మండ్యజైలుకు తరలించామన్నారు. ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. అయితే 144వ సెక్షన్ విధించినా వేలాదిమంది నిరసన ర్యాలీలో పాల్గొన్నారన్నారు. కాగా మంగళవారం మద్దూరు బంద్‌కు బీజేపీ, జేడీఎస్‌తోపాటు హిందూ సంఘాల పిలుపు నేపథ్యంలో మరింత అప్రమత్తమై చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.



మద్దూరులో మాట్లాడుతున్న జేడీఎస్ యువ నాయకుడు నిఖిల్

మానవత్వమే మతం

- మేరీమాత ఉత్సవాల్లో సీఎం సిద్దరామయ్య



శివాజీనగర్ సెయింట్ బెసిలికా చర్చ్ వద్ద క్రైస్తవులు



సీఎంను స్వాగతిస్తున్న బిషప్ పీటర్ మచాడో

బెంగళూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మానవత్వమే మతమని భిన్నత్వంలో ఏకత్వం మన సిద్ధాంతమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. మేరీ మాత ఉత్సవాల ముగింపు వేడుకలలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం శివాజీనగర్‌లోని సెయింట్ బెసిలికా చర్చ్ ప్రాంగణంలో మేరీమాత రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రైస్తవులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ మానవత్వం లేని మతం సరికాదన్నారు. మానవత్వ ధర్మమే అన్నింటికీ మూలమన్నారు. బసవణ్ణ ఎనిమిది శతాబ్దాలకిందట చెప్పిందే మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌లు ఆశించారన్నారు. బిషప్ పీటర్ మచాడో, మంత్రి కేజే జార్జ్, స్థానిక ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆలయాల్లో సంప్రోక్షణలు.. ప్రత్యేక దర్శనాలు

- చంద్రగ్రహణం అనంతరం దర్శనానికి బారులు తీరిన భక్తులు



గవిగంగాధరేశ్వర ఆలయంలో భక్తుల క్యూ

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూసివేసిన అన్ని ఆలయాలను సోమవారం తెల్లవారునుంచి శుద్ధి చేశారు. ఆలయ ప్రాంగణాలతోపాటు సంప్రోక్షణ కొనసాగించారు. ఆ తర్వాత అభిషేకాలు జరిపి భక్తుల దర్శనాలకు అవకాశం కల్పించారు. బసవనగుడిలోని గవిగంగాధరేశ్వర ఆలయంలో రుద్ర హోమం జరిపారు. జయనగర్‌లోని రాయరమఠంలో నవగ్రహశాంతి హోమం, నరసింహస్వామి రంగవల్లి వేసి మండలపూజ చేశారు. దొడ్డగణేశ ఆలయంలో పూజలు, అభిషేకాల తర్వాత వెన్న అలంకరణ చేశారు. అనంతరం భక్తుల దర్శనానికి అవకాశం కల్పించారు. మైసూరు చాముండేశ్వరి దేవి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు కొనసాగాయి. సంప్రోక్షణల తర్వాత అమ్మవారి దర్శనానికి అవకాశం కల్పించారు. శృంగేరి శారదామాత, మలె మహదేశ్వరస్వామి, ధర్మస్థల మంజునాథస్వామి, మంగళూరులోని కద్రి వేణుగోపాలస్వామితో పాటు నంజన్‌గూడు శ్రీకంఠేశ్వరస్వామి, బెంగళూరు వయ్యాలికావల్‌లోని టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి.



దొడ్డ గణేశుడిని దర్శించుకుంటున్న భక్తులు

రూ.884 కోట్ల ఖనిజాన్ని

దోచేశారు

- ఆంధ్రాలో అనుమతులు.. కర్ణాటకలో తవ్వకాలు
- ఓఎంసీ పేరుతో అక్రమ రవాణా
- 'సిట్'కు నివేదించిన టపాల్ గణేష్

బళ్లారి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ఆంధ్రలోని ఓఎంసీ గనుల లీజు అడ్డం పెట్టుకుని కర్ణాటక నుంచి అక్రమంగా 29 లక్షల మెట్రిక్ టన్నులు అనగా రూ.884 కోట్ల విలువైన ఖనిజాన్ని గాలి జనార్దన్‌రెడ్డి అండ్ కంపెనీ దోచుకున్నారని గతంలో మైనింగ్ యజమాని అయిన టపాల్ గణేశ్ ప్రభుత్వానికి నివేదించారు. కర్ణాటక మైనింగ్ ఏరియా నుంచి ఆంధ్ర మైనింగ్ పర్మిట్లతో అక్రమంగా రవాణా చేశారని ఆయన ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై పూర్తి ఆధారాలు ఇవ్వాలని సిట్ సూచించిన మేరకు టపాల గణేశ్ సోమవారం రాతపూర్వకంగా పూర్తి వివరాలు అందజేశారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఉండే మైనింగ్ కంపెనీల ఎంబీటీ, ఇతర మైనింగ్ యజమానులు కూడా గాలి జనార్దన్‌రెడ్డికి సహకరించినట్లు ఆయన తెలిపారు. ఓబుళాపురం ఏరియాల్లో మైనింగ్ లీజులు పొంది కర్ణాటకలోని గనులను దోచుకున్నారన్నారు. కర్ణాటక ప్రభుత్వం గాలి జనార్దన్‌రెడ్డితో రూ.884 కోట్లు రికవరీ చేయించాలని ఆయన నివేదికలో కోరారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పికి


మరో14రోజుల కస్టడీ

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వివాదంలో కోట్లాది రూపాయలు ఆర్జించారనే సమాచారంతో ఆగస్టులో ఈడీ దాడి చేసింది. ఇప్పటివరకు మూడుసార్లు ఈడీ, వీరేంద్ర, అతడి బంధువుల నివాసాలపై దాడులు కొనసాగించింది. సోమవారంతో ఈడీ కస్టడీ ముగిసిన మేరకు ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. మరో 14రోజుల జ్యుడీషియల్ కస్టడీకి న్యాయమూర్తి ఆదేశించారు. కాగా రెండు రోజులకిందట యాక్సిస్‌బ్యాంకు లాకర్స్‌లో 24.50 కేజీల బంగారం బిస్కట్లు, 17 బంగారు వజ్ర ఉంగరాలు గుర్తించినట్టు తెలుస్తోంది. 14రోజుల కస్టడీ విధించడంతో వీరేంద్రను జైలుకు తరలించారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు

టెన్షన్..!





- అన్ని శాఖల్లో పదిశాతం మించరాదని ప్రభుత్వ నిర్ణయం
- ఉద్వాసన తప్పదని భయం.. భయం
- పలుశాఖల్లో 80వేలమంది కంటే అధికం

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పలు శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఆందోళన మొదలయ్యింది. తమ కుర్చీలు ఉంటాయో లేదోనన్న ఆందోళన మొదలయ్యింది. దశాబ్దాలకాలంగా వివిధశాఖల్లో ఉద్యోగుల నియామకాలు చేపట్టలేదు. అయితే పదవీవిరమణలతో సీనియర్ అధికారులను వివిధశాఖలు కోల్పోతున్నాయి. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు దక్కుతున్నాయి. హోదాలు పెరిగినా అదనపు బాధ్యతలు కొనసాగించాల్సి వస్తోంది. రెండు దశాబ్దాలకుపైగా సర్వీసు నిండినవారికి నేటి ఆధునాతన డిజిటల్ వ్యవహారాలు అర్థం కావడం లేదు. పైగా ఆఫ్‌లైన్ అనే విధానాన్ని పక్కనపెట్టి ఆన్‌లైన్‌తోనే కీలకశాఖలు పాలనాపరమైన వ్యవహారాలు కొనసాగిస్తున్నాయి. ప్రత్యామ్నాయం లేక అన్నిశాఖలు కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగులను నియమించుకుంటున్నారు. ఇలా కొత్తగా శాఖలలోకి వచ్చినవారు కంప్యూటర్ వ్యవహారాలను సులభతరంగా చేస్తున్నారు.

పలువురు బలి..

కాంట్రాక్టు ఉద్యోగుల భారం పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వం 10శాతం పరిమితిని పెట్టాలని నిర్ణయించింది. దీంతో వివిధశాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న లక్షలాదిమంది కాంట్రాక్టు ఉద్యోగుల మెడపై కత్తి వేలాడుతున్నట్టు అయ్యింది. ప్రస్తుతం ప్రభుత్వంలోని 46శాఖలలో 80వేల మంది, బోర్డులు, కార్పొరేషన్లు, ప్రభుత్వ అనుబంధ సంస్థలతో కలిపి లక్షమందికంటే ఎక్కువ కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొన్నిశాఖలలో పరిస్థితి చేయిదాటిపోయింది. రెగ్యులర్ ఉద్యోగులకంటే కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉంది. దీంతో కాంట్రాక్టు ఉద్యోగులకు పరిమితి పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించి రిజర్వేషన్లు, నియామకాల సవరణలు నిబంధన 2025ను సిద్ధం చేశారు. వాటి ప్రకారం శాఖలలో 10శాతం కంటే ఎక్కువ కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేసేందుకు వీలు లేదు.

పర్మినెంట్ నియామకాలకు స్వస్తి

కాలానికి అనుగుణంగా నియామక ప్రక్రియలు కొనసాగలేదు. పలు శాఖలలో ఉద్యోగాల నియామకానికి సంబంధించి కోర్టులలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఆర్థికభారం నుంచి తప్పించుకునేందుకు నియామక ప్రస్తావనలను వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో కారణాలతో ప్రభుత్వశాఖలలో ఏకంగా 2.80 లక్షలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాలనాపరమైన నిర్వహణ ఉద్దేశంతో కాంట్రాక్టు ఉద్యోగుల, నియామకాలకు ప్రాధాన్యం ఇస్తూ వస్తుండడంతో కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతూ వచ్చింది.

పాలన సౌకర్యమే లక్ష్యం

ఆర్థికశాఖ లెక్కల ప్రకారం కాంట్రాక్టు పద్ధతిన 80,006 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్‌లో కార్పొరేషన్‌లు, మండలులలో కాంట్రాక్టు పద్ధతిన 22,326 మంది పనిచేస్తున్నారు. శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలకు బడ్జెట్‌లో 2,273 కోట్ల రూపాయలు వినియోగిస్తున్నారు. బోర్డులు, కార్పొరేషన్లలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేవారికి రూ.739 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల చెల్లింపులకు ఆర్థిక అధికారాన్ని ప్రత్యామ్నాయంగా పాలనాపరశాఖకు కేటాయించారు. ఉద్యోగుల హాజరు, కార్యనిర్వహణ నివేదికను నిబంధనల ప్రకారం పరిశీలించి వేతనాల చెల్లింపులు పాలనా వ్యవహారాలశాఖ ద్వారా వేతనాలు చెల్లింపులను అధికారులను బాధ్యులుగా చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించి రిజర్వేషన్లు నియామకాల నిబంధన 2025 ప్రకారం వివిధశాఖలకు మంజూరైన పోస్టులలో 10శాతానికి మించి కాంట్రాక్టు ఉద్యోగులు ఉండరాదని పేర్కొన్నారు. ఒకవేళ పదిశాతానికి మించి కాంట్రాక్టు ఉద్యోగులు ఉంటే ఏటా వారి సంఖ్య తగ్గించుకుని రావాలని ప్రస్తావించారు. ప్రభుత్వశాఖలు, బోర్డులు, కార్పొరేషన్లు, ప్రభుత్వ అనుబంధసంస్థలు ఫారం 8ని ఏటా ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. అందులో పోస్టులు, మంజూరైనవారి సంఖ్య, కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేవారి సంఖ్య, కాంట్రాక్టు ఉద్యోగులను తగ్గించిన వివరాలను నమోదు చేసి పంపాల్సి ఉంటుంది. ఇలా కొనసాగిస్తే అన్నిశాఖలలోనూ కాంట్రాక్టు ఉద్యోగులను తక్కువ చేయవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది.

కారుణ్య నియామకాలు ఇందులోనే..

ప్రముఖశాఖలలో, బోర్డులలో ప్రజా ప్రతినిధుల పలుకుబడి ఒత్తిడి, సిఫారసుల ద్వారా ఏటా కాంట్రాక్టు పద్ధతిన నియమకాలు జరుపుకొంటూ వచ్చారు. డ్రైవర్లు, అటెండర్లు, అసిస్టెంట్‌ల పోస్టులను భర్తీ చేశారు. కొన్ని ఉద్యోగాలు అనసవరమైనా, వారు పనిచేయకపోయినా వేతనాలు పొందుతున్నట్టు విమర్శలు ఉన్నాయి. కారుణ్య నియమాకం, ఒత్తిడి కారణంగా నియమించుకుంటే వివరాలను పంపాలని సూచించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలు

శాఖ	ఉద్యోగులు
రెవెన్యూ	16,494
వైద్య ఆరోగ్యం	11,304
మైనారిటీ సంక్షేమం	6,805
ఎస్సీవర్గాల సంక్షేమం	6,475
బీసీ వర్గాల సంక్షేమం	5,683
ఆర్థిక	3,748
పశుసంవర్ధకం	3,722
అటవీ	3,525
గ్రామీణాభివృద్ధి	2,904
స్త్రీ శిశుసంక్షేమ	2,819
ఉన్నత విద్య	2,705
అంతర్గత పాలనా	1,629
ఎస్టీ సంక్షేమం	1,575
వ్యవసాయం	1,523
పాలనా సంస్కరణలు	1,358
కార్మిక	1,233
న్యాయశాఖ	1,100
బోర్డులు, కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలు	
వైద్యవిద్య	16,230
ఆరోగ్యం	1,537
వ్యవసాయ	1190

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా ఇంటర్ విద్యార్థి మృతి

- నంద్యాల జిల్లా డోన్ వసతి గృహంలో ఘటన
- విద్యార్థి యాడికి వాసి


శ్యాంసుందర్ (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యాడికికి చెందిన ఇంటర్ విద్యార్థి శ్యాంసుందర్ (16) ప్రభుత్వ వసతి గృహంలో అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన సోమవారం నంద్యాల జిల్లా డోన్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలోని చౌడేశ్వరికాలనీకి చెందిన రమేష్, సావిత్రి దంపతులు చేనేత వృత్తిద్వారా జీవనం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శ్యాంసుందర్ నంద్యాల జిల్లా డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. సెలవులు అని ఇంటికి వచ్చిన శ్యాంసుందర్ ఇంటివద్ద మగ్గం పనులు చురుకుగా చేసేవాడు. ఆదివారం మధ్యాహ్నం డోన్‌కు వెళ్లాడు. రాత్రి 7గంటల సమయంలో కూడా తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడాడు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో శ్యాంసుందర్ ఉంటున్న హాస్టల్ నుంచి ఫోన్ వచ్చింది. శ్యాంసుందర్ హాస్టల్‌లోనే ఉరివేసుకున్నాడని సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన డోన్‌కు వెళ్లారు. ఉరివేసుకున్న శ్యాంసుందర్ మృతదేహాన్ని పరిశీలించి తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు డోన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్యాంసుందర్ మృతదేహాన్ని యాడికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.


విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

కృష్ణాపురంలో యువకుడు..


వేణు (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో వేణు (26) అనే యువకుడు అనుమానస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. కృష్ణాపురం గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమారుడు వేణుకు ఆరు సంవత్సరాలు క్రితం మర్తాడు గ్రామానికి చెందిన శ్రీరాములు కుమార్తె లక్ష్మితో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. వేణు, లక్ష్మి తరుచు గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలోనే మర్తాడులో కాపురం పెట్టారు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పది రోజుల క్రితం దంపతులు గొడవ పడ్డారు. దీంతో వేణు కుమారుడిని తీసుకుని కృష్ణాపురం వెళ్లాడు. ఆదివారం సాయంత్రం లక్ష్మి కూడా కుటుంబ సభ్యులతో కలసి కృష్ణాపురం వెళ్లింది. అ సమయంలో వేణు గ్రామంలో లేకపోవడంతో లక్ష్మి కుమారుడిని తీసుకుని మర్తాడుకు వెళ్లింది. రాత్రి ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో వేణుకు కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. తాను ఆలస్యంగా వస్తానని చెప్పాడు. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూడగ వేణు ఇంటి ముందు వేసిన షెడ్డులో లుంగీతో ఉరివేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల వారి సాయంతో వేణును కిందకు దింపగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రాణం తీసిన ప్రశ్న

- తిండి గింజలు అమ్ముకుంటావా అని ప్రశ్నించిన భార్య
- గొడ్డలితో నరికి చంపిన భర్త


లక్ష్మీదేవి (ఫైల్)

చిలమత్తూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న తిండి గింజలు అమ్ముకొని తాగేశావా అని ప్రశ్నించినందుకు ఓ వ్యక్తి తన భార్యను ఆదివారం రాత్రి గొడ్డలితో నరికి చంపాడు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రాఘవేంద్ర, లక్ష్మీదేవి(30)లు నివాసమున్నారు. వీరికి శృతి అనే కుమార్తె ఉంది. రాఘవేంద్ర కొన్నేళ్లుగా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భర్త జులాయిగా తిరుగుతుండటంతో లక్ష్మీదేవి కుటుంబ పోషణ కోసం కూలి పనులకు వెళ్లేది. ఈక్రమంలో ఆదివారం ఆమె పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో నిల్వ ఉంచిన 50 కిలోల బియ్యాన్ని రాఘవేంద్ర ఎత్తుకెళ్లి అమ్మేశాడు. వచ్చిన డబ్బుతో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కూలి పని నుంచి వచ్చిన లక్ష్మీదేవి ఇంట్లో బియ్యం కనపడకపోవడంతో భర్తను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహం చెందిన రాఘవేంద్ర రాత్రి 10 గంటల పైన నిద్రపోతున్న లక్ష్మీదేవిని గొడ్డలితో నరికాడు. ఆమె రక్తపు మడుగులో పడి ఉండటం చూసిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీదేవిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాఘవేంద్రను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం-3లో (65) సంవత్సరాల గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 9866144616 నంబరులో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో సూపర్ సిక్స్-సూపర్‌హిట్ బహిరంగ సభ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లించినట్లు ఎస్పీ జగదీష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంక్షలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. హైదరాబాద్ నుంచీ బెంగళూరు వైపు వెళ్లే వాహనదారులు అనంతపురం నగరం నుంచి కాకుండా వడియంపేట, బుక్కరాయసముద్రం, నాయనపల్లి క్రాస్, నార్పల క్రాస్, బత్తలపల్లి, ధర్మవరం, ఎస్ఎస్ గేట్ మీదుగా నేషనల్ హైవే 44 మార్గంలో వెళ్లాలన్నారు. కర్నూలు నుంచి తిరుపతి, చెన్నై వెళ్లే వాహనదారులు వడియంపేట, బుక్కరాయసముద్రం, నాయనపల్లి క్రాస్, బత్తలపల్లి, కదిరి, మదనపల్లె మార్గంలో వెళ్లాలని సూచించారు. బళ్లారి నుంచీ బెంగళూరు వెళ్లే వాహనదారులు చెళ్లికెర, తుంకూరు, నెలమంగళ, బెంగళూరు మార్గంలో ప్రయాణించాలని సూచించారు. బెంగళూరు నుంచీ హైదరాబాద్ వెళ్లే వాహనదారులు బత్తలపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి క్రాస్, బుక్కరాయసముద్రం, వడియంపేట, నేషనల్ హైవే 44 రహదారిలోకి చేరి ప్రయాణించాలన్నారు. తిరుపతి, చెన్నై నుంచి కర్నూలు వెళ్లాలనుకునే వాహనదారులు కదిరి, బత్తలపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి క్రాస్ మీదుగా బుక్కరాయసముద్రం వచ్చి వడియంపేట మీదుగా నేషనల్ హైవే 44 చేరుకుని కర్నూలు వెళ్లాలని సూచించారు. బెంగళూరు నుంచి బళ్లారి వెళ్లే వాహనాలు సైతం అనంతపురం రాకుండా నెలమంగళ, తుంకూరు, చెళ్లికెర మార్గంలో వెళ్లాలని ఎస్పీ సూచించారు.

తుది దశకు..!

- పూర్తి కావస్తున్న డీఎస్సీ ఎంపిక ప్రక్రియ
- డ్యూయెల్ పోస్టుల స్థానంలో మరొకరికి అవకాశం
- నేడో.. రేపో.. కాల్ లెటర్లు..


డీఎస్సీ అర్హత జాబితాను సరిచూస్తున్న ఐటీ విభాగ సిబ్బంది

అనంతపురం విద్య, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 15 రోజుల క్రితం మెరిట్ లిస్టు ఇచ్చారు. ఇప్పటి వరకు 807 టీచర్ పోస్టులకుగాను 773 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపారు. అర్హత కలిగిన ఏ ఒక్క అభ్యర్థీ నష్టపోకూడదని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. బోగస్‌ల ఏరివేతకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కాల్‌లెటర్లు వచ్చిన డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయించి, పక్కాగా పరిశీలింపజేస్తున్నారు. అదే అభ్యర్థుల సర్టిఫికెట్లను నాలుగుసార్లు ప్రత్యేక కమిటీలతో పరిశీలన చేయించారు. ఒకటి నుంచి మూడో దఫా వరకు అక్కడక్కడా అభ్యర్థుల సర్టిఫికెట్లపై రిమార్కులు బయటపడుతూ వచ్చాయి. దీంతో సోమవారం నాలుగోసారి ఆ సర్టిఫికెట్లను ఇతర కమిటీలతో పరిశీలన చేయించారు. అందులో ఒక్క రిమార్క్ కూడా రాలేదని వెరిఫికేషన్ బృందాలతోపాటు విద్యాశాఖ అధికారవర్గాలు తెలిపాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

త్వరలో ఎంపిక జాబితా?

టీచర్ల నియామకాల పక్రియను రాష్ట్ర శాఖ చేపడుతోంది. మెరిట్ ఆధారంగా లిస్టు ప్రకటించి, ఆ తర్వాత సబ్జెక్టులతో సంబంధం లేకుండా అభ్యర్థులను అక్కడే ఎంపికచేసి, వారికి నేరుగా కాల్‌లెటర్లు పంపారు. ఆ కాల్ లెటర్లు వచ్చిన అభ్యర్థులకు మాత్రమే జిల్లాలో విద్యాశాఖ అధికారులు.. సర్టిఫికెట్ల పరిశీలన చేయించారు. ఆ సమయంలో కొందరు అభ్యర్థులు తమకు ఎక్కువ మార్కులు ఉన్నా.. కాల్‌లెటర్ రాలేదని ఆందోళన చెందుతూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కాల్‌లెటర్లు వచ్చిన అభ్యర్థులు ఏ సబ్జెక్టుకు ఎంపికయ్యారో కూడా ఎవరికీ తెలీకపోవడంతో ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. ఇపుడు వాటికి చెక్ పెడుతున్నారు. ఎవరైనా అభ్యర్థి రెండు పోస్టులకు ఎంపికై ఉండుంటే ఆయనకు దరఖాస్తులో ఇచ్చిన ప్రాధాన్యత ఆధారంగా ఆ పోస్టుకు ఎంపిక చేసి, ఇతర పోస్టులకు ఆయా సబ్జెక్టుల్లో అర్హత ఉన్నోళ్లకు అవకాశం కల్పించనున్నారు. ఈ డ్యూయెల్ పోస్టులకు ఇతర అభ్యర్థులను ఎంపికచేసి నేడో.. రేపో.. జిల్లాలకు జాబితా పంపనున్నారు. ఆ మేరకు అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం డీఈఓలతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు రాజధానిలో సమావేశం నిర్వహించారు. పరిశీలనలో రిమార్కులు, రిజెక్టు అయిన వారి సమాచారం తెలుసుకున్నారట. దీనిపై క్లారిటీ రావడంతో ఇక కటాఫ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి, జాబితా విడుదలకు మార్గం సుగమమైందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

- ఏపీ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాబ్జీ


మాట్లాడుతున్న వలవల మల్లికార్జునరావు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు(బాబ్జీ) పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని విజయనగర లా కాలేజి సెమినార్ హాల్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా కార్మికశాఖ అధికారులతోపాటు భవన నిర్మాణ కార్మికులు, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు, ట్రేడ్ యూనియన్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్షకు వలవల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం సంక్షేమ బోర్డు అన్నిరకాల చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీ నరసయ్య, శ్రీ సత్యసాయి జిల్లా సహాయ కమిషనర్ శ్రీకాంత్ నాయక్, ధర్మవరం సహాయ కమిషనర్ సూర్యనారాయణ, అనంతపురం ఉపకమిషనర్ లావణ్య, కార్మికశాఖ అధికారులు, సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి స్కూల్ గేమ్స్ సమాఖ్య ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్-11, 14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. అండర్-11కి సంబంధించి 2015 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండి 3, 4, 5 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. అండర్-14కు 2025 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు. అండర్-17కు 2009 జనవరి 1వతేదీ తరువాత జన్మించి, 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు. అండర్-17కు 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించి 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రాప్తాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా రాప్తాడులోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలకు అందించే సేవల గురించి వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్, సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ డ్రైవ్

అనంతపురం విద్య, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ఈనెల 10న స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధి నారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2024-25లో కనీసం 75శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైనవారు పాల్గొనవచ్చన్నారు. ఈ క్యాంపస్ డ్రైవ్ ద్వారా హెచ్‌సీఎల్ టెక్‌బీ, ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం కింద ఐటీ పరిశ్రమలోకి వెళ్లే అవకాశం కల్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

గుత్తి కోట ట్రెక్కింగ్

గుత్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుత్తి కోటపై అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ టీం ఆధ్వర్యంలో సోమవారం ట్రెక్కింగ్ నిర్వహించారు. అడ్వెంచర్ టీంకు స్థానిక గుత్తికోట సంరక్షణ సమితి నాయకులు ఘనస్వాగతం పలికారు. గుత్తికోటలోని కట్టడాలను పరిశీలించి నివేదికను జిల్లా టూరిజం శాఖ, కేంద్ర పురావస్తు శాఖకు అంద జేస్తామని టీం సభ్యులు ఈశ్వర్, మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్, నాగరాజు, సుధాకర్ నాయుడు, జిలాన్, నిజాం పాల్గొన్నారు.


గుత్తికోటను ఎక్కేందుకు వచ్చినవారితో సంరక్షణ సమితి ప్రతినిధులు

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ నాయకుల మండిపాటు
- కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఐ, రైతుసంఘం నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందంటూ సీపీఐ జిల్లాకార్యదర్శి పాళ్యం నారాయణస్వామి మండిపడ్డారు. రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీరైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు సోమవారం రైతులతో కలిసి స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా చూసినా యూరియా కోసం రైతులు బారులు తీరడం చూస్తుంటే ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందన్నారు. అధికారపార్టీ అండదండలతో యూరియాను ఏజెన్సీలు బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నాయని, అందువల్లే రైతులకు యూరియా కష్టాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. యూరియాను తరలించిన డిస్ట్రిబ్యూటర్లతోపాటు అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి రైతులకు ఎరువులను సకాలంలో అందించేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, శ్రీరాములు, రమణయ్య, కృష్ణుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పీఎఫ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఉప లోకాయుక్త రజని


హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ ఈఈ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎఫ్ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఉప లోకా యుక్త పి.రజని సోమవారం సూచించారు. గతంలో జలవనరుల శాఖ పరిధిలోని హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో రూ.27 లక్షలు పీఎఫ్ సొమ్ము స్వాహా కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై బాధితులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కేసు వివరాలు ఇలా..

హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో 2021 మార్చి నెలలో ఉద్యోగ విరమణ పొందిన డీఈ రామసంజన్న జీపీఎఫ్ ఖాతా నుంచి రూ.17.14లక్షలను జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్ నకిలీ ఐడీలను సృష్టించి, పెనుకొండలోని ఓ ప్రైవేటు ఏజెన్సీ ఖాతాలో జమ చేశాడు. ఈ మొత్తాన్ని కర్ణాటక రాష్ట్రం తుమకూరులోని ఓ బ్యాంకులో డ్రాచేశారు. ఇందులో రూ.15లక్షలు జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్ తీసుకుని, మిగిలిన మొత్తాన్ని బినామీ ఖాతాదారుడికి అందజేశారు. రూ.15లక్షల్లో రూ.10లక్షలతో బంగారం కొనుగోలు చేసినట్లు సమాచారం.

- మరో కేసులో జేఈ జీపీఎఫ్ రూ.10లక్షలను, పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి బ్యాంకులోని బినామీ ఖాతాలో జమచేశారు. అక్కడ కూడా బినామీ చేత డ్రా చేయించి, స్వాహా చేశారు. వీటిపై అప్పట్లో హెచ్చెల్సీ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు నిందితుడైన ప్రవేశ్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ చేసి బకాయిలపై 7.1శాతం వడ్డీని చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పట్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పనిచేసిన కె వెంకటరమణారెడ్డి, ఎ వెంకటసురేష్ బాబు, అప్పటి సూపరింటెండెంట్లు పీఎండీ ఉస్మాన్, కె సుబ్రహ్మణ్యంలతో పాటు జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ప్రవేశ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కస్టడీకి తరలించారు. ఫిర్యాదుదారుల సమస్యను పరిష్కరించడం, బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ, ఆర్థిక శాఖల ప్రధాన కార్యదర్శుల తక్షణ స్పందన పట్ల ఉపలోకాయుక్త రజని అభినందనలు తెలిపారు. నిర్లక్ష్యం, మోసం కారణంగా ఏ ఉద్యోగి కష్టపడి పొదుపు చేసిన సొమ్ము కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.


క్రేన్ సాయంతో గేదెను బావి నుంచి బయటకు తీస్తున్న సిబ్బంది

హమ్మయ్యా..! బతికిపోయా..!!

మేత మేస్తూ ఓ పాడి గేదె ప్రమాదవశాత్తు బావిలో పడింది. అందులో నీళ్లు ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. కానీ బయటకు వచ్చే మార్గం కాన రాక ఆ గేదె నీళ్లలోనే ఈదుకుంటూ ఉండిపోయింది. కాసేపటి తర్వాత రైతు గేదె కోసం వెతకగా బావిలో కనిపించింది. దీంతో ఆయన గ్రామస్తుల సాయంతో క్రేన్‌ను తెప్పించారు. దాని ద్వారా తాళ్లను కట్టి గేదెను ఒడ్డుకు చేర్చారు. గేదెను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేసినట్లు రైతు కత్తే తిమ్మన్న తెలిపాడు. ఈ సంఘటన మండలంలోని కత్తే కొట్టాల గ్రామంలో సోమవారం జరిగింది.

- ధర్మవరంరూరల్, ఆంధ్రజ్యోతి

షెడ్డుపైకి దూసుకెళ్లిన లారీ

- సెక్యూరిటీ గార్డు దుర్మరణం


మస్తాన్ (ఫైల్)

తాడిపత్రి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ సమీపాన సోమవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి రేకులషెడ్డుపైకి దూసుకెళ్లింది. అందులో నిద్రిస్తున్న సెక్యూరిటీ గార్డు మస్తాన్(50)పై వెళ్లడంతో అతడు దుర్మరణం చెందాడు. రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రిలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన మస్తాన్ హైవే పనుల వద్దకు సెక్యూరిటీ గార్డుగా వెళ్తుండేవాడు. అందులో భాగంగా ఆదివారం రాత్రి బుగ్గ సమీపాన రోడ్డు పనులు చేపడుతున్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డులో నిద్రించాడు. తెల్లవారుజామున బనగానపల్లి వైపు నుంచి తాడిపత్రికి వస్తున్న లారీ అదుపుతప్పి షెడ్డుపై దూసుకెళ్లింది. అందులోని మస్తాన్‌పై లారీ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి


సురేష్ (ఫైల్)

కణేకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామనగర్ క్యాంపు వద్ద పొలంలో టీడీపీ కార్యకర్త సురేష్(24) సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్ గ్రామానికి చెందిన సురేష్ టీడీపీలో చురుకైన కార్యకర్త. ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుండేవాడు. సోమవారం సీతారామనగర్ క్యాంపు వద్ద సోమనాథ్ అనే రైతు పొలంలో విద్యుత్ మరమ్మత్తులు చేస్తుండగా.. ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. సురేష్‌కు ఆరునెలల క్రితం పవిత్రతో వివాహమైంది సురేష్ మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

పాముకాటుతో బాలిక..

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడిమేపల్లికి చెందిన హేమశ్రీ (6) పాముకాటుతో చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుడిమేపల్లికి చెందిన హరిజన బడిగే మల్లికార్జున, మారెక్క దంపతుల కుమార్తె హేమశ్రీ. ఈనెల 5వ తేదీన బాలికను పాము కాటు వేసింది. హుటాహుటిన కళ్యాణదుర్గం ఆర్డీటీ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మూడురోజులుగా చికిత్స పొందుతూ బాలిక సోమవారం మరణించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మల్లికార్జునకు ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు, బాబు ఉన్నారు. హేమశ్రీ పెద్ద కుమార్తె.

యువతి అదృశ్యం

గార్లదిన్నె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన యువతి బోయ అశ్విని అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనకచెర్ల గ్రామానికి చెందిన బోయ నాగరత్నమ్మ కుమార్తె సరోజను కర్నూలు జిల్లా ఆలూరికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. సరోజ కుమార్తె అశ్విని చిన్నప్పట్నుంచి పెనకచెర్లలో అమ్మమ్మ నాగరత్న వద్దే ఉంటూ చదువుకుంటోంది. నెల రోజుల క్రితం అశ్వినికి అనంతపురానికి చెందిన ఓ యువకుడితో వివాహ నిశ్చితార్థం చేసుకున్నారు. ఈనెల 5న బ్యాంకులో పని ఉందని అమ్మమ్మకు చెప్పి.. అశ్విని గార్లదిన్నెకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో నాగరత్నమ్మ.. కుమార్తె సరోజకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. తన వద్దకు రాలేదని కుమార్తె చెప్పడంతో అశ్విని కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం గార్లదిన్నె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అశ్విని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి: డీజీపీ



మాట్లాడుతున్న డీజీపీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పర్యటన, సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభ, ప్రముఖుల పర్యటన నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయన లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీలు, డీఐజీలు, ఐపీఎస్‌లతో కలిసి భద్రతపై సమీక్షించారు. సీఎం టూర్ సభాస్థలి వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాల్లో బందోబస్తు, హైవేపై ట్రాఫిక్ మళ్లింపు, సీసీ కెమెరాల పనితీరు, డ్రోన్స్ నిఘా తదితర అంశాలపై జిల్లా ఎస్పీ జగదీష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఐపీఎస్‌లను ఆదేశించారు. విజయోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, ప్రజలు వస్తారని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఐజీ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఇతర డీఐజీలు సెంథిల్ కుమార్, కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, అమ్మిరెడ్డి, విజయరావు, సత్యఏసుబాబు, పక్కీరప్ప, అన్బురాజన్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, ఇతర ఎస్పీలు, అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

లియో టాల్‌స్టాయ్ (జయంతి)



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయిత, నవలాకారుడు లియో టాల్‌స్టాయ్ 1828 సెప్టెంబరు 9న జన్మించారు. సోవియెట్ యూనియన్ రష్యాకు చెందిన ఆయన ప్రపంచ ప్రసిద్ధి చెందారు. 1902 నుంచి 1906 వరకు ప్రతి సంవత్సరం సాహిత్యంలో నోబెల్ బహుమతి కోసం ప్రతిపాదించబడ్డారు. ఆ తర్వాత కూడా ప్రతిపాదించబడినా కంట్రావర్సీ కారణంగా బహుమతి రాలేదు. వార్ అండ్ పీస్, అన్నా కరెనీనా నవలలు ఎంతో పేరొందాయి. 1910 నవంబరు 20న కన్నుమూశారు.

కాళోజీ నారాయణరావు (జయంతి)




తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వనిగా కొనియాడబడిన 'పద్మవిభూషణ్' గ్రహీత కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబరు 9న కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా రట్టిహళ్ళిలో జన్మించారు. సాంఘిక, రాజకీయ చైతన్యాల సమాహారం. కవిత్వం రాసిన ప్రజా కవి. హక్కులు అడిగిన ప్రజల మనిషి. ఉద్యమం నడిపిన ప్రజావాది. మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి కాళోజీ. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం పట్టాడు. స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన పుట్టినరోజును తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి గౌరవించింది. పలు పురస్కారాలు అందుకున్నారు. 2002 నవంబరు 13న పరమపదించారు.

వేదాంతం సత్యనారాయణ శర్మ (జయంతి)



వేదాంతం సత్యనారాయణ శర్మ 1935 సెప్టెంబరు 9న కృష్ణా జిల్లా కూచిపూడిలో జన్మించారు. రంగస్థల నటుడు, కూచిపూడి నృత్య కళాకారుడు. సత్యభామ, ఉష, దేవాదేవి, విశ్వమోహినీ పాత్రలను అమోఘంగా పోషించారు. తొమ్మిదేళ్లకే కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు. స్త్రీ పాత్రల్లోనూ వివిధ వేషాలు కడుతూ వారితో అంచెలంచెలుగా ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. నవ రసాలు రంగస్థలంపై అలవోకగా పండించగల దిట్ట. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు, కాళిదాస్ సమ్మాన్ తదితర అవార్డులు పొందారు. 2012 నవంబరు 15న కన్నుమూశారు.

అక్షయ్‌కుమార్ (పుట్టినరోజు)



ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ 1967 సెప్టెంబరు 9న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో జన్మించారు. నిర్మాత, మార్షల్ ఆర్ట్స్ కళాకారుడు. అసలు పేరు రాజీవ్ హరి ఓం భాటియా. వందకుపైగా సినిమాల్లో నటించారు. రెండు జాతీయ ఉత్తమ నటుడి అవార్డులు, రెండు ఫిలింఫేర్ అవార్డు, ఇంకా పద్మశ్రీ పురస్కారం పొందారు. 2015లో ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచంలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే నటుల జాబితాలో 9వ స్థానంలో నిలిచారు. విండ్సర్ యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. నటి ట్వింకిల్ ఖన్నాను పెళ్లి చేసుకున్నారు. సామాజిక సేవలోనూ రాణిస్తున్నారు.



బ్యాంక్ మేనేజర్లతో సమావేశమైన మురారి

గృహలక్ష్మి సొమ్ము రుణాలకు జమ చేయవద్దు

- బ్యాంకర్లకు గ్యారెంటీ పథకాల సమితి అధ్యక్షుడి సూచన

రాయచూరు సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు అందే సొమ్మును వారి కుటుంబాల రుణాలకు జమ చేయవద్దని గ్యారెంటీ పథకాల అమలు జిల్లా కమిటీ అధ్యక్షుడు పామయ్య మురారి సూచించారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం పామయ్య మురారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడిన పామయ్య మురారి, అనేక మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమా చేసిన సొమ్మును రుణాల వసూళ్లకు జమా చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీంతో లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన ఆర్థిక చేయుత నిష్ప్రయోజనంగా మారే పరిస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటి వరకు అలా రుణాల కోసం జమా చేసిన సొమ్మును తిరిగి వారి ఖాల్లోకి మళ్లించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు.

పావగడ తహసీల్దార్‌గా రవి

పావగడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పావగడ తహసీల్దార్‌గా వై.రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న తహసీల్దార్ వరదరాజు బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో చిక్కబళ్లాపురంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రవిని ఇక్కడ నియమించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

ప్రైవేటీకరణ వద్దు

హిందూపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయరాదని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న పీపీపీ విధానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. చంద్రశేఖర్, అరవింద్, కిరణ్, ఎస్ఎన్ గణేష్ పాల్గొన్నారు.

హిందువుల్లో ఐకమత్యం పెరగాలి

» హారికా మంజునాథ్

విజయపుర, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో 120 కోట్లమంది హిందువులు ఉన్నారని అయితే ఐకమత్యం పెరగాల్సి ఉందని యువవ్యాఖ్యాత, రచయిత్రి హారికా మంజునాథ్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయ పుర పట్టణంలోని గాంధీచౌక్‌లో వినాయకభక్తమండలి ఆధ్వర్యంలో 90వ వార్షిక వినాయక ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక ధార్మిక ప్రసంగం చేశారు. హిందువులలో బ్రాహ్మణ, లింగాయత, హొలెయ, మాదిగ తదితర కులాలు, ఉప కులాలు ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం రాకముందు బ్రిటీషులపై పోరాడేందుకు ప్రజలను చైతన్యం చేసేందుకు బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలే వంటివారు 133 ఏళ్లక్రితం గణేశ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ గణేశ ఉత్సవం సావర్కర్, చంద్రశేఖర్ ఆజాద్ తదితర విప్లవవీరులు పుట్టుకొచ్చేందుకు కారణమైందన్నారు. ఈ సందర్భంగా హారికాను ఆత్మీయంగా సత్కరించారు. రోటరీ సంస్థ అధ్యక్షులు విజయబాబు, పురసభ సభ్యులు శిల్ప అజిత్, రోటరీ ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యదర్శి సిద్దరాజు, ఇన్నర్‌వీల్ మాజీ అధ్యక్షురాలు దీప మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



గణేష్ ఉత్సవంలో హారికాకు సన్మానం

ఆదర్శప్రాయుడు.. నారాయణ గురు

ముళబాగిలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కులాలు మతాల తారతమ్యం లేని సమాజం కోసం నారాయణగురు కృషి చేశారని ఆయన ఆదర్శాలు నేటికీ అనుసరణీయమని తహసీల్దార్ గీతా అభిప్రాయపడ్డారు. తహసీల్దారు కార్యాలయంలో నారాయణగురు జయంతి నిర్వహించారు. నారాయణ గురు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ మనుష్యులు పరస్పర మానవతా సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని నారాయణగురు ప్రజలను చైతన్యం చేశారన్నారు. అస్పృశ్యతను వ్యతిరేకించారన్నారు. కాగా బ్రహ్మశ్రీ నారాయణగురు సముదాయ భవన నిర్మాణానికి రెవెన్యూశాఖ నుంచి స్థలాన్ని ఇవ్వనున్నట్టు తెలిపారు. దేవదాయశాఖ అధికారి సుబ్రమణ్యం, అక్షరదాసోహ సహాయక డైరెక్టర్ ఆనంద్, ఈడిగ సముదాయ ప్రముఖులు నారాయణస్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



నారాయణ గురు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొత్తనూరులో ఆరోగ్య జాగృతి



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కొత్తనూరు గ్రామంలో గ్రామీణ కృషి కార్యానుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ఆరోగ్య జాగృతి నిర్వహించారు. బెంగళూరు వ్యవసాయ విశ్వ విద్యా లయం బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్‌ల సహకారంతో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఔషధాలను ఉచితంగా పంపిణీ చేశారు. డయట్ కౌన్సె లింగ్ చేశారు. జీకేవీకే విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కొత్తనూరు గ్రామ అభివృద్ధి అధికారి పవిత్ర మేడం, జీకేవీకే ప్రాధ్యాపకులు డాక్టర్ గణేశ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజమే బలమైన దేశం కానుందన్నారు. 150మందికిపైగా శిబిరంలో పాల్గొన్నారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వలంటీర్లుగా పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.



రక్తదానం చేస్తున్న గ్రామస్థులు

కార్యవర్గం ఎన్నిక



గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

దొడ్డబళ్లాపుర, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖమైన సంఘాలలో ఒకటైన దేవాంగ మండలికి నూతన కార్యవర్గం ఎన్నికయ్యారు. తేరువీధిలోని అరళుమల్లిగె గేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పోలింగ్ జరిగింది. ఎన్నికలలో 4543 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎంజీ శ్రీనివాస్ నేతృత్వంలోని జట్టు కేజీ దినేశ్, ఎన్.ఎస్ చిక్కణ్ణ నేతృత్వంలోని జట్లు తలపడ్డాయి. శ్రీనివాస్ జట్టుకు 16 స్థానాలు, కేజీ దినేశ్, ఎన్.ఎస్.చిక్కణ్ణ నేతృత్వంలోని బృందం నాలుగుస్థానాలు దక్కించుకుంది. కోశాధికారిగా పోటీ చేసిన అఖిలేశ్‌కు అత్యధికంగా 3,332 ఓట్లు దక్కాయి. నూతన కార్యవర్గం వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఫలితాలను ప్రకటించారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎంజీ, ఉపాధ్యక్షులుగా అమరనాథ్ బీజే, చిక్కణ్ణ ఎన్ఎ, గౌరవ కార్యదర్శిగా అమరనాథ్ ఎంజీ, సహకార్యదర్శిగా నటరాజ్, కోశాధికారిగా అఖిలేశ్, ఇక డైరెక్టర్లుగా మంజునాథ, మహేశ్, కుమార్, రాఘవేంద్ర, ప్రభాకర్, నరేంద్ర, నటరాజ, లక్ష్మీకాంత, నిర్మల, ప్రియాంక, గోపాలకృష్ణ, శివకుమారలు గెలిచారు.

బడుగు, బలహీనవర్గాల పార్టీ కాంగ్రెస్

- ఎమ్మెల్సీ వసంత్ కుమార్ • పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్ నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు

రాయచూరు సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకుని వారి అభ్యున్నతి కోసం నిబద్ధతతో పని చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ వసంత్ కుమార్ అన్నారు. సోమవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు నగరసభ మాజీ సభ్యుడు ఈశప్ప ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వసంత్‌కుమార్ సీనియర్ నాయకుడు బసవరాజ ఇటగిలు పార్టీ కండువాలు కప్పి నాయకులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎ.వసంత్ కుమార్, ఓట్ల చోరీ పై రాహుల్ గాంధి చేపట్టిన పోరాటానికి ప్రతియొక్కరు అండగా నిలవాలన్నారు. ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల ద్వార జరుగుతున్న ఓట్ల చోరీ పై ప్రజల్లో విస్తృత అవగాహనం కల్పించేందుకు విద్యావంతులను సమీకరించాలన్నారు. అదే సమయంలో పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం లభిస్తుందని పార్టీ అభ్యున్నతి కోసం ప్రతియొక్కరు అంకిత భావంతో పని చేయాలని కోరారు.

భగవంతుడి సేవకు మించినది ఏదీ లేదు

హిందూపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భగవంతుని సేవకు మించిందేది లేదని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పేట వెంకటరమణస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా భగీరథ నవీన్‌చంద్ర, తొమ్మిది మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ పేట వెంకటరమణస్వామి ఆలయ కమిటీలో చైర్మన్, సభ్యులుగా అవకాశం దక్కడం అదృష్టమన్నారు. భగవంతునిపట్ల సేవ చేయాలన్న సంకల్పం ఉన్నవారే నిజమైన భక్తులన్నారు.

లోకేష్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

కంప్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక కాంగ్రెస్ కమిటీ ప్రస్తుత విద్యావిధానాల సమీక్ష దృష్టిలో వుంచుకుని రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా కల్పించారు. కంప్లి పట్టణంలోని కల్మట ప్రభుస్వామి ఎయిడెడ్ హైస్కూలులో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న లోకేష్‌కు కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉత్తమ టీచర్‌గా అవార్డును అందించారు. సెప్టెంబరు 5న బెంగళూరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మాజీ ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ ఎంపిక చేపట్టి అవార్డులు అందించారు. ఈ అవార్డును కేపీసీసీ అధ్యక్షులు, డీసీఎం డీకే శివకుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తాము చేసిన సేవలను గుర్తించి కర్ణాటక ప్రదేశ కాంగ్రెస్ పార్టీ తమకు ఈ అవార్డు అందించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు.

ప్రయోగాలు.. సమాజానికి ఉపయోగపడాలి

హిందూపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రయోగనమూనాలు సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయించాలని డీవైఈఓ జాన్‌రెడ్డప్ప సూచించారు. సోమవారం చిన్మయ విద్యాలయంలో పెనుకొండ డివిజనల్‌స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుపై శిక్షణ సైన్స్, గణిత ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలనే దానిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను గైడ్‌చేసి పంపించే ప్రయోగనమూనా వినూత్నంగా ఉండాలన్నారు. ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, తనూజ్‌కుమార్, మనోజ్‌కుమార్, సచింద్ర పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ గురు జయంతి

సిరుగుప్ప, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒకే మతం ఒక్కడే దేవుడు ఒకే కులం అను సందేశాన్ని చాటిచెప్పిన ఏకైక మహనీయుడు బ్రహ్మర్షి నారాయణ గురువులని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో తాలుకా పరిపాలన, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మర్షి నారాయణ గురువుల 177వ జయంతి వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీఎం సతీష్, ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్ మాట్లాడుతూ మనిషి నేటి యుగంలో వేగంగా అభివృద్ధి చెందాలంటే విద్య అత్యవసరమని ఆయన తెలిపారు. ముందు రోజుల్లో కులమత బేధాలతో జనం అడ్డదారిలో వెళ్లేవారని తెలిపారు. వాటినన్నింటిని సరిచేసిన ఏకైక వ్యక్తి నారాయణ గురువులని తెలిపారు. తాలుకా బీఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొడ్లి మల్లికార్జున మాట్లాడుతూ బ్రహ్మర్షి నారాయణ గురువుల చరిత్రను వివరించారు. ఈడిగ సమాజానికి చెందిన సినీనటులు దివంగత డాక్టర్ రాజ్‌కుమార్, మాజీ ముఖ్యమంత్రి బంగారప్ప ఉన్నతస్థాయికి ఎదిగారని ఆయన గుర్తు చేశారు. ప్రతి సమాజం అభివృద్ధి చెందాలంటే విద్య, ఉపాధి, శ్రమ అత్యవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఈడిగ సమాజం అధ్యక్షులు రామాంజనేయ, ఉపాధ్యక్షులు ఉలియప్ప, ప్రముఖులు చంద్రశేఖర్, మంజునాథ, మహేష్, తాలుకా పంచాయతీ మేనేజర్ సుజాత కోరి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు బీఎం సతీష్

శక్తి గ్యారెంటీకి గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్



గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో సీఎం, మంత్రి

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి గ్యారెంటీ పథకంలో 500కోట్లమందికిపైగా మహిళలు ఉచితంగా ప్రయాణించడంతో గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఇందుకు సంబంధించిన ప్రమాణపత్రాన్ని రవాణాశాఖ మంత్రి రామలింగా రెడ్డి, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు చూపించి హర్షం వ్యక్తం చేశారు. కృష్ణాలో సోమవారం గ్యారెంటీ పథకాల ప్రగతి పరిశీలనా సమావేశం జరిగింది.

రాధాకృష్ణరాజుకు జీవన సాఫల్య పురస్కారం



రాధాకృష్ణరాజును సన్మానిస్తున్న నాయకులు

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర తెలుగు సమాఖ్య, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర వాణిజ్యమండలి సంయుక్తంగా తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజుకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. మహారాష్ట్రలోని థానెలో ఆదివారం కార్యక్రమం జరిగింది. విజయగరం ఎంపీ కాళిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, మహారాష్ట్ర రవాణామంత్రి ప్రతాప్ సర్ నాయక్, కిమ్స్ ఆసుపత్రి సీఎండీ భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బెంగళూరులో తెలుగు విజ్ఞాన సమితి ద్వారా 55ఏళ్లుగా భాషా సాహిత్యరంగాలలో సేవలందించినందుకు జీవనసాఫల్య పురస్కారం దక్కిందన్నారు. మహారాష్ట్ర తెలుగు సమాఖ్య అధ్యక్షుడు గంజి జగన్‌బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, సమితి ఉపాధ్యక్షులు ఆదికేశవులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో రాణించిన విద్యార్థులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): గౌరి బిదనూరులో జిల్లా స్థాయిలో ఆదివారం జరిగిన స్కేటింగ్ పోటీలలో శిడ్లఘట్టకు చెందిన స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ విద్యార్థులు రాణించారు. పలు విభాగాలలో బహుమతులు సాధించారు. 12 మంది ప్రథమ స్థానం, 10మంది ద్వితీయ స్థానం, 8మంది తృతీయస్థానం సాధించినట్టు స్కేటింగ్ కోచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. వీరిని సోమవారం ఆత్మీయంగా సత్కరించారు.



ట్రోఫీ, మెడల్స్‌తో విద్యార్థులు

రాష్ట్రంలో 256 మంది నకిలీ డాక్టర్లు

బెంగళూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అర్హతలు, లైసెన్సులు లేకుండానే చికిత్సలు అందిస్తున్న నకిలీ డాక్టర్లను వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. ఏడాదికాలంగా జరిపిన కార్యాచరణలో 256మంది నకిలీ డాక్టర్లు ఉన్నట్టు నిర్ధారించారు. కర్ణాటక ప్రైవేట్ వైద్యసంస్థల నియంత్రణ చట్టానికి అనుగుణంగా వైద్యశాఖల అధికారుల బృందాలు 2024-25 ఏడాదికి 89 మందిని గుర్తించినట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. అధికారులు జరిపిన దాడులలో 154మందికి కేసులు, జరిమానా విధించినట్టు ప్రకటించారు. వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం అలోపతి, ఆయుర్వేద, హోమియోపతిలలో ఏ విభాగంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అటువంటి వైద్యమే అందించాల్సి ఉంటుంది. ఆయుర్వేద, హోమియోపతి లైసెన్సులు పొంది అలోపతి వైద్యం చేస్తున్నట్టు పలుచోట్ల గుర్తించామన్నారు.

మా కులం మంత్రులే తప్పు చేశారా?

- వాల్మీకి సమాజ స్వామీజీల ఆగ్రహం

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మా కులానికి చెందిన మంత్రులపైనే టార్గెట్ చేశారని, ఇతర మంత్రులు ఎవరిపైనా అవినీతి ఆరోపణలు రాలేదా..? అంటూ వాల్మీకి సమాజానికి చెందిన స్వామిజీ కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళితో చర్చలు జరిపిన స్వామిజీలు వెంటనే ఢిల్లీ పెద్దలతో చర్చలు జరపాలని సూచించినట్టు తెలుస్తోంది. నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి తీవ్రం కానుందని హెచ్చరిం చినట్టు తెలుస్తోంది. దీంతో సతీశ్ జార్కిహొళి ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమైనట్టు సమాచారం. వాల్మీకి సమాజానికి చెందిన బీ నాగేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిపై ఈడీ విచారణలకు సిద్ధం కావడంతో రాజీనామా అనివార్యమైంది. విచారణ సంస్థలు క్లీన్‌చిట్ ఇస్తే మరోసారి కేబినెట్‌లో అవకాశం కల్పిస్తామని సీఎం సిద్దరామయ్య బహిరంగంగా ప్రకటించారు. సీఎం హామీ ఇచ్చి 15 నెలలు ముగుస్తున్నా ఆచరణకు నోచుకోలేదు. తాజాగా రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటు చౌర్యం పోరాటానికి వ్యతిరేకంగా మాట్లాడారని సహకారశాఖ మంత్రి రాజణ్ణను కేబినెట్‌నుంచి తొలగించారు. ఇటీవల వాల్మీకి సమాజానికి చెందిన స్వామిజీలు రాజణ్ణ ఇంటికి వెళ్లి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఆ పరిణామమే సతీశ్‌జార్కిహొళి ఢిల్లీ వెళ్లదలిచినట్టు తెలుస్తోంది. అధిష్ఠానం ఏ విధంగా స్పందిస్తుందనేది వేచి చూడాల్సి ఉంది.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	42.965	34,983
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	40,081	34,743
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

గేట్ల ఏర్పాటు పనులు సత్వరమే చేపట్టాలి

● టీబీ డ్యామ్ భద్రతపై అధికారులు దృష్టి పెట్టాలి ● బోర్డు కార్యాలయం ముందు రైతుల ఆందోళన

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి సంబంధించి 33క్రస్ట్‌గేట్లను నిర్ణీత సయంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ రాయచూరు, కొప్పళ, బళ్ళారి, విజయనగర జిల్లాల రైతు సంఘం నాయకులు సోమవారం తుంగభద్ర జలాశయం పాలనా భవనం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం, హసిరు సేన గౌరవ అధ్యక్షుడు చామరస మాలిపాటీల్, మాజీ ఎంపీ వెంకటరావ్ నాడగౌడ, మాజీ ఎమ్మెల్యే వెంకటప్ప నాయక, సాహితి అల్లమ ప్రభు బెట్టదూరు, రైతు ప్రముఖులు వీరసంగయ్య, బడేలడకు నాగేంద్ర నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో రైతులు, వ్యవసాయ సంబంధిత పరిశ్రమలను నమ్ముకున్న కార్మికులు పాల్గొని నిర్ణీత సమయంలోనే 33 గేట్లు భిగించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర బోర్డు అధికారులు ప్రస్తుతం కొన్ని గేట్ల మరమ్మతుకు సిద్ధం అయ్యారని, నీటి ప్రమాణం తగ్గిన వెంటనే గేట్లు భిగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెబుతున్నా... ఇంతవరకు ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే గేట్ల ప్రక్రియ ప్రారంభం అయ్యే అవకాశం ఉందని రైతు నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. తుంగభద్ర నీటినే నమ్ముకుని ఒక ప్రక్క రైతులు, రైస్ మిల్లులు, ట్రాక్టర్ల యజమానులు ఇలా... లక్షలాది మంది ప్రత్యక్షంగా... పరోక్షంగా తుంగభద్ర నీటిపైనే ఆధారపడ్డారని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నిర్ణీత సమయంలోనే డ్యామ్‌కు 33 క్రస్ట్‌గేట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డికి వినతిపత్రం అందజేశారు.



బోర్డు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

నమ్మించి.. గొంతు కోశాడు

- ప్రియుడి మాటలు నమ్మి భర్తను వదిలేసి వెళ్లిన మహిళ
- పెళ్లికి నిరాకరించడంతో వివాదం
- గాజు సీసాతో గొంతు కోసేందుకు ప్రయత్నించిన ప్రియుడు
- పోలీసులకు ఫిర్యాదు

బళ్లారి,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'నీ భర్తను వదిలేసి రా నేను నిన్ను పెళ్లిచేసుకుంటాను' అని మాజీ ప్రియుడు ఆమెను నమ్మించాడు. నన్ను ప్రేమించావు. వేరే వాళ్లతో పెళ్లిచేసుకుని పోతే నేను ఏమికావాలి అని రోజూ ఫోన్ చేసి ప్రేమను ఒలకపోశాడు. మాయ మాటలు నమ్మి పెళ్లి చేసుకున్న భర్తనే కాదనుకుని ప్రియుడు వద్దకు వెళ్లింది. అయితే తీరా ప్రియుడు మాత్రం ఆమెను మోసం చేశాడు. ఏకంగా ఆమె గొంతు పై గాజు సీసా పగలకొట్టి దానితో గొంతు కోసే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన కొప్పళ లోని మహనాద్ నగర లో జరిగింది. కొప్పళ పోలీసులు తెలిపిన వివారాల ప్రకారం కొప్పళ లోని మహనాద్ నగరకు చెందిన షమీనా అనే యువతిని కుష్టిగి గ్రామానికి చెందిన ఖలీల్ అనే వ్యక్తితో గత మూడేళ్ల క్రితం పెళ్లి చేశారు. షమీనా కొప్పళలోని మహనాద్ నగర్‌లో ఉండే రమేష్ అనే వ్యక్తితో పెళ్లికి ముందు నుంచే ప్రేమలో ఉంది. పెళ్లి చేసుకున్నా షమీనాతో రమేష్ రోజూ ఫోన్‌లో మాట్లాడేవారు. నీ భర్తను వదిలి వచ్చే నేను నిన్ను తిరిగి పెళ్లి చేసుకుంటాను అని నమ్మించాడు. ఆమె మాటలు నమ్మి రమేష్ వద్దకు చేరుకుంది. అయితే రమేష్ పెళ్లికి నిరాకరించాడు. నిన్నే నమ్మి వచ్చాను ఇలా వదిలేస్తే ఎలా అని ఆమె నిలదీసింది. రమేష్ ఆమే నుంచి ఎలాగైనా బయట పడాలని భావించి అక్కడ ఉండే నీటికాలువ వద్దకు తీసుకుపోయి గాజు సీసాను పగలగొట్టి గొంతు మీద కత్తి పెట్టి చంపే ప్రయత్నం చేశాడు. ఆమే ఆమె అవవరడంతో రోడ్డు పక్క వెళ్లే వారు వచ్చి ఆమేను రక్షించారు. ఈవిషయం బాధిత రాలు కొప్పళ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా సుంకులమ్మ మండల పూజ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కౌల్‌బజార్ 29వ వార్డు పరిదిలోని దానప్పవీదిలో గల సుంకులమ్మ, నల్లమ్మదేవిల మండల పూజ సోమవారం ఘనంగా జరిగింది. వేకువ జామున అమ్మవారికి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం హోమాలు తదితర పూజలు చేపట్టారు. పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులందరికి అన్నదానంచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోదండ, పెద్దన్న, వెంకటేశ్, పరమేశ్,సుంకన్న, రామాంజి, కృష్ణమూర్తి, రమేశ్, వెంకటేశులు, నాగోజి, నవీన్, జయరాములు పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు

విద్యతో విలువలు పెరగాలి

● జిల్లా పంచాయతీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే..



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శశికాంత్ శివపురే

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే సమాజంలో మానవుడు మెరుగైన ఉద్యోగం భవిష్యత్తు, సంస్కృతి విలువలను సాదించగలడని, మానవీయ విలువలు పెరగాలని జిల్లాపంచాయతీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే అన్నారు.సోమవారం నగరంలోని కోటే ప్రాంతంలో తాలూకా పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి దర్శిని శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామపంచాయతీ సూపర్‌వైజర్లు, తాలూకా బహుళార్దసాధక పునరావాస కార్మికులకు దర్శిని అవగాహన గ్రంథాలయ కేంద్రాల ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక అవసరాలు గలవారికి వివిధ పుస్తకాల జ్ఞానాన్ని అందిస్తే ప్రత్యేక అవసరాలు గలవారు మెరుగైన భవిష్యత్తును ఏర్పరుచుకుని సమాజంలోని ప్రధాన స్రవంతిలోకి ప్రవేశించగలరని ఆయన అన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న అడ్డంకులు, దివ్యాంగుల హక్కుల చట్టం 2016, దర్శిని నాలెడ్జ్ లైబ్రరీ సెంటర్ల పరిచయం, విజ్ఞాన కేంద్రాలు, అంధ పిల్లలకు అందించబడిన సహాయక పరికరాల పరిచయం ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లాపంచాయతీ రిసోర్స్ సెంటర్ అనిల్‌కుమార్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప, విజయనగర జిల్లాకు చెందిన దివ్యాంగుల సంక్షేమ అధికారి రామాంజిని, రూపనగుడి గ్రామ పంచాయితీ అభివృద్ధి అధికారి శివానంద్, తాలూకా రిసోర్స్ సెంటర్ అసిస్టెంట్లు,జిల్లాలోని ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, కార్మికులు, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కళలతో సనాతన ధర్మరక్షణ'

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భారతీయ కళలు సంస్కృతికి నిలయాలు. ఇలాంటి సంప్రదాయ కళలతో మన సనాతన ధర్మం దైదీప్యంగా వెలుగొందుతుందని ప్రముఖ కళాకారుడు కల్యాణ స్వామి తెలిపారు. ఆదివారం రాత్రి శరణ సభాభవనంలో నిర్వహించిన బళ్లారి కల్చరల్ సంఘం 53వ వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శీల బ్రహ్మయ్య సేవలు అనన్యం అని అన్నారు. అనంతరం నృత్యసంగీత, నాటక, చిత్రలేఖన కళాకారులకు సమాజ సేవకులకు విద్యార్థులకు పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు శీలబ్రహ్మయ్య, అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్, కార్యదర్శి రామచంద్ర, ఉపాధ్యక్షులు గాదెప్ప, మంజునాథ్, ప్రకాశ్, సహ కార్యదర్శిలు రామకృష్ణ, నాగభూషణ్,రామమూర్తి, సంఘం సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు



సన్నాపురంలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

వరిపొలాలను పరిశీలించిన అధికారులు

కంప్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలో సన్నాపురం, బెళగోడుహాళ్, ఇటిగి, మన్నూరు తదితర గ్రామాల్లో వరి పంటకు లీఫ్ బెయిల్ట్ వైరస్ తెగుళ్లసోకి రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని తెలుసుకుని హగరి వ్యవసయా విజ్ఞాన కేంద్రం పరిశోధకులు సీఏ మంజునాథ్‌రెడ్డి, డాక్టర్ పాలయ్య, రవి సోమశేఖర్ తదితరులు వైరస్ చూసిన వరి పంటలను వీక్షించారు. ఈ సందర్భంగా మంజునాథరెడ్డి పాలయ్య మాట్లాడుతూ అధిక వర్షపాతం వల్లనే ఈ తెగుళ్ల సోకాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పలు జాగ్రత్తలు వహించాలన్నారు. వరి పంట కంకి మీదున్న పంటకు సెప్రోసైటిస్, కార్బన్ జైము పిచికారి చేసుకుంటే తెగుళ్ల అదుపులోకి వస్తాయన్నారు. వరి కంకి వదలకుండా వుండిన పంటలు కాపర్ ఆక్సిడ్ క్లోరైడ్ పిచికారి చేస్తే తెగులు సోకకుండా నివారణ వుంటుందన్నారు. రైతులు అధికారులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటించినట్లయితే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ప్రతి యేటా పంటలు వేయకముందే భూమిపరీక్షలు నిర్వహించి భూమికి కావలసిన మందులను వాడినట్లయితే రోగనిరోధక శక్తి ఏర్పడుతుందన్నారు. పంటల్లో ఎక్కువ మోతాదులో నీరు నిల్వ వుండకుండా చూసుకోవాలన్నారు. అధికారులతో పాటు రైతులు కృష్ణ, తిప్పయ్య పాల్గొన్నారు.

వైద్యుడిని నియమిస్తాం: కలెక్టర్



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎస్ దివాకర్

కంప్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): హగరి బొమ్మనహళ్లి తాలుకాలో పలు ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల కొరత విషయంపై ఫిర్యాదు రావడంతో సోమవారం విజయనగర జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ హంపసాగరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ చికిత్స కోసం వచ్చిన రోగులు బంధువులు ఈ ఆస్పత్రిలో డాక్టర్ కొరత వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటామని కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎంఎస్ దివాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యం చేసేందుకు డాక్టర్లు వెనుకనుంచి వేస్తున్నారు. లక్షల్లో జీతాలు వచ్చినా ముందుకు రావడం లేదని వారికి తెలిపారు. రాష్ట్రంలోనే డాక్టర్ల కొరత ఉందన్నారు. త్వరలోనే జిల్లాలో సర్వే చేపట్టి ఈ ఆరోగ్య కేంద్రానికి ఒక పర్మినెంట్ డాక్టర్ నియమిస్తామని తెలిపారు. తమ పరిధిలోని డాక్టర్స్ వునన్నట్లు అయితే వెంటనే వారిని నియమిస్తారన్నారు.

ఉచిత ఫిజియో థెరపీ

బళ్లారి రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం అనంతపురం రోడ్డులో ఉన్న అనంత వాసుదేవ ఆస్పత్రిలో సోమవారం డాక్టర్ ప్రణతి కార్తీక్, డాక్టర్ హరీష్ నేతృత్వంలో ఉచిత ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలకు నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రజలు పాల్గొని కీళ్లు, మోకాళ్లు, ఎముకలకు సంబంధించి పలువురు ఆస్పత్రికి చేరుకుని శస్త్రచికిత్సలు లేకుండానే చేయించుకున్నారు. శస్త్ర చికిత్స లేకుండానే పలు నొప్పులను నయం చేసుకోవచ్చని డాక్టర్ ప్రణతి కార్తీక్ తెలిపారు.

సీఎంకు కంటి పరీక్షలు నిర్వహించిన ఎమ్మెల్యే



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసులు

కంప్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో సీఎం సిద్దరామయ్యకు కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసు, ఆయన భార్య డాక్టర్ పుష్ప కంటి పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉపాధ్యాయ దితన్సోవంలో పరీక్షలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి ఆయనకు రెండు అరుదైన అద్దాలను ఇచ్చామన్నారు. ఎమ్మెల్యేల్లో ఒకరు కంటి వైద్యులు వుండటం హర్షణీయమని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు.



బసవ సంస్కృతి ఊరేగింపులో చిన్నారులు

బసవ సంస్కృతి ప్రాశస్త్యంపై ప్రచారం

బళ్లారి సిటీ, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): బసవ సంస్కృతిని, బసవేశ్వరుడి గ్రంధాలను చాటి చెప్తూ ఊరేగింపు నిర్వహించారు. విజయనగరం జిల్లా హొసపేటలో ఆదివారం సాయంత్రం బసవన్న కర్ణాటక సాంస్కృతిక నాయకుడుగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బసవ సంస్కృతి ప్రచార ఊరేగింపు ఘనంగా జరిగింది. లింగాయత్ గ్రంథాలు, వచన సాహిత్య కట్టలను తలపై మోసుకుంటూ పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్ నుంచి ప్రారంభమై దాదాపు రెండు కి.మీ దూరంలో ఉన్న బసవేశ్వర సర్కిల్ వరకు ఊరేగింపు సాగింది. హొసపేట బసవ బృందం ఇష్టలింగ అధ్యయన కేంద్రం పిల్లలు, కళాకారులు ప్రదర్శించినవచన డ్రమ్స్ ,వచన నృత్యంతో ఈ ఊరేగింపు నగర ప్రజల దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 20మందికిపైగా మత పెద్దలు నాయకత్వం వ హించిన ఈ ఊరేగింపుకు బసవ జ్యోతి రథం వివిధ పారాయణకారుల వేషధారణలో పిల్లలను తీసుకుకెళ్ళే వాహనం ప్రజలను ఆకర్షించింది.



గ్రంథాలను మోసుకెళ్తున్న మహిళలు

బిహార్‌కు తరలిన రైతు సంఘం నాయకులు



బిహార్ బయల్దేరుతున్న రైతు సంఘం నాయకులు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసురుసేన ఆద్వర్యంలో బళ్లారి జిల్లా రైతులు బీహార్‌లో జరుగుతున్న ఈనెల 10, 11, 12 మూడు రోజుల పాటు జరుగుతున్న రైతు సమావేశానికి జిల్లా నుంచి నాయకులు తరలివెళ్లారు. సోమవారం కర్ణాటక రైతు రాష్ట్ర సంఘం అధ్యక్షులు మాధవరెడ్డి నేతృత్వంలో భారీఎత్తున రైతులు బీహార్‌కు బళ్లారి రైల్వే స్టేషన్ నుండి బయలుదేరి సమావేశంలో పాల్గొంటున్నట్లు రైతు సంఘం రాజ్యాధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. బీహార్లో రైతు సమావేశంలో పాల్గొని రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని భూసేకరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సమస్యలపై బీహార్ వెళుతున్నట్లు తెలిపారు.

వీరశైవ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ ఆఫీసర్ శరణ బసవ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):అక్షరాస్యత మన జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తుందో సమాజాన్ని ఉద్దరించడంలో అది ఎలా సహాయ పడుతుందో, అది గౌరవంగా బతకడానికి సహాయపడుతుందని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ శరణబసవ అన్నారు. నగరంలోని వీరశైవ మహావిద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. చదువు జీవితంలో గౌరవంగా జీవించడానికి వీలు కల్పిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించడం దీని లక్ష్యం. వ్యక్తులు,సమాజాలు, సమాజాలకు విద్య ముఖ్యమని నొక్కిచెప్పడానికి విద్యార్థుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. డిజిటల్ యుగంలో అక్షరాస్యతను ప్రోత్సహించడం ద్వారా అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్యఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పిన్సిపాల్ మల్లనగౌడ, మనోహర్, కవితా సంగనగౌడ, కుమారి, రేఖశ్రీ, ఉమాపతి, డాక్టర్ భ్రమరాంబ, జాతీయ సేవాపథకం వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంచుకోవాలి

● సర్ ఎంవీ పీయూ కళాశాల అధ్యక్షుడు సురేష్ కుమార్



క్రీడాకారులను అభినందిస్తున్న సురేష్ కుమార్

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు-ఓటములు సహజమని, విద్యార్థులు ఈ రెండింటిని సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలని సర్ ఎంవీ పీయూ కళాశాల అధ్యక్షుడు సురేష్ కుమార్ సూచించారు. సోమవారం సత్యం పీయూ కళాశాల, సర్ ఎంవీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన తాలూకా స్థాయి ఖోఖో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిత్యం నాలుగు గోడల మధ్య చదువులకే పరిమితం కాకుండా తరచూ క్రీడల్లో పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా సత్యం కళాశాల కార్యదర్శి జగదీష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్

సీఎం పర్యటనపై సన్నాహక సభ



మాట్లాడుతున్న ఆది ద్రావిడ సంక్షేమ కమిటీ సభ్యులు

హోసూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటన నేపథ్యంలో హోసూరు డీఎంకే కార్యాలయంలో ఆది ద్రావిడ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేకంగా సన్నాహకసమావేశం నిర్వహించారు. కమిటీ నిర్వాహకుడు గురు ఎంగిర మునిరాజ్ అధ్యక్షత వహించగా, సహాయ నిర్వాహకుడు ఎడ్విన్‌రాజ్ పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించే వేళ ముఖ్యమంత్రిని ఘనంగా స్వాగతించదలిచారు. సమావేశంలో పార్టీ నాయకులు సురేశ్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు



శిబిరంలో ప్రసంగిస్తున్న వ్యవసాయ అధికారి

రైతులకు అవగాహన శిబిరం

హోసూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): హోసూరు బ్లాక్ పరిధిలోని రైతులకు దేవిచెట్టిపల్లిలో ప్రత్యేక అవగాహనా శిబిరం నిర్వహించారు. బయో ఫెర్టిలైజర్లు, సూక్ష్మ పోషక ఎరువులు, సూడోమోనాస్ ప్రయోజనాల గురించి వ్యవసాయ సహాయ సంచాలకులు భువనేశ్వరి వివరించారు. ఆదియమాన్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కీర్తన మాట్లాడుతూ మట్టి నమూనాలు, నేల వనరుల నిర్వహణ ప్రాధాన్యతను వివరించారు. అసిస్టెంట్ వ్యవసాయ అధికారి వెంకటేశ్, జిల్లా టెక్నికల్ మేనేజర్‌లు టిల్లర్ యాప్ ప్రాధాన్యతను తెలియచేశారు. పంటల బీమా ఆవశ్యకతను వివరించారు.

క్విజ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

హోసూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు తమిళ, ఆంగ్ల సాహిత్య వేదిక పోటీలు మూడు విభాగాలలో సాగాయి. సాహిత్య వేదిక పోటీలు, కవితా రచనలు, వ్యాసరచనలు, వక్తృత్వ పోటీలు, కథ చెప్పడం, క్విజ్ పోటీలు ఈనెల 3న జరిగాయి. పెదరపల్లి కార్పొరేషన్ మిడిల్‌స్కూల్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థులు మెహతా, మధుశ్రీ అనే విద్యార్థులు కేటగిరీ1లో యూనియన్‌లో మొదటిస్థానంలో నిలిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో ప్రథమస్థానంలో నిలిచి విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు పొన్నుకేశ్, ఉపాధ్యాయులు ప్రశంసించారు. రాణించిన విద్యార్థులు అక్టోబరులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్ఎం పొన్నుకేశ్



విద్యార్థిని, ఆమె తల్లిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

స్వర్ణ హంస..

● నాలుగు బంగారు పతకాలు సాధించిన విద్యార్థికి ఘనంగా సన్మానం

సిరుగుప్ప, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాలుగు బంగారు పతకాలు పొందిన విద్యార్థిని హంసకు మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప సోమవారం ఘనంగా సత్కరించారు. సోమవారం సిరుగుప్ప తాలుకా పరిధిలోని టెక్కలకోట పట్టణంలో కళ, సాహిత్యం, సంగీతం, విద్యలో నాలుగు బంగారు పతకాలు పొందిన ఎస్ హంసకు, ఆమె తల్లికు గౌరవ పూర్వకంగా సన్మానం చేశారు. నేటి రోజుల్లో విద్యార్థులు పథకాలతో పాటు ఉన్నత విద్య, ఉద్యోగాలను దక్కించుకోవాలని అన్నారు. టెక్కలకోట అధ్యక్షుడు ఆనంద తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ డంప్‌లను తొలగించాలి

● రాష్ట్రవ్యాప్త పోరాటానికి వెనుకాడం: భూ నిర్వాసిత పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సండూర్ తాలూకా తారానగర్ గ్రామంలో 4.3ఎకరాల భూమిలో మైనింగ్ కంపెనీలు అక్రమంగా పారవేసిన గనుల వ్యర్థాలను మూడు వారాల్లో తొలగించాలని, లేకపోతే చట్టపరమైన పోరాటానికి సిద్ధమవుతామని భూ నిర్వాసిత పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్ హెచ్చరించారు. సోమవారం నగరంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈస్థలం 1982 తారానగర్‌కు చెందిన హరిజన పెద్ద సక్రప్పకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అతని మనవడు తాయప్ప శరధ్ధువు సమయంలో జేఎస్‌డబ్ల్యూ, ఎం.ఎల్ తుంగా, భద్ర మైన్స్ 2019 నుంచి ఈ భూమిలో అక్రమంగా వ్యర్థాలను పారబోశారన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఎవ్వరూ సంబంధం లేదంటున్నారని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎలాగని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా పారవేసిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని, ఈ మైనింగ్ కంపెనీలు సంబంధిత అధికారులపై విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగల (దౌర్జన్యాల నివారణ) చట్టం 1989 కింద కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న పోరాట కమిటీ అధ్యక్షుడు మంజునాథ్